సాక్షి
పల్నాడు
బుధవారం, 13, నవంబర్, 2024



డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన మురళి

నరసరావుపేట: జిల్లా రెవెన్యూ అధికారిగా పి.మురళి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మర్యాదపూర్వకంగా కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



జెడ్పీని సందర్శించిన కృష్ణతేజ

గుంటూరుఎడ్యుకేషన్: రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణ తేజ మంగళవారం జెడ్పీ కార్యాలయాన్ని సందర్శించారు.

వెండి సర్వాభరణాలు విరాళం



నరసరావుపేట ఈస్ట్: రావిపాడురోడ్డు బాలయ్య నగర్‌లోని కల్యాణ సుందరేశ్వరస్వామి ఆలయ పార్వతీ అమ్మవారికి రూ.7లక్షల విలువైన వెండి సర్వాభరణాలను పట్టణానికి చెందిన భడభాగ్ని శ్రీనివాసరావు, భువనేశ్వరి దంపతులు అందజేశారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ముఖ్యం

- జిల్లాలో అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించండి
- వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



నరసరావుపేట: వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నవంబర్ 14న సహకార మంత్రిత్వ శాఖ కొత్త కార్యక్రమాల ద్వారా ఉద్యమాన్ని బలోపేతం చేసే కార్యక్రమాలు, 15న సహకార సంఘాలలో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన కార్యక్రమాలు, 16న వ్యవస్థాపకత, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర కార్యక్రమాలు, 17న సహకార సంస్థలు వ్యాపార ప్రయోజిత సంస్థలుగా రూపాంతరం కార్యక్రమాలు, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించుట కార్యక్రమాలు, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల కోసం సహకార సంఘాలు కార్యక్రమాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధన, మెరుగైన సమాజ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర వంటి తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీవో వెంకట రమణ, డివిజనల్ కోఆపరేటివ్ అధికారి నాగ శ్రీనివాస్, జిల్లా కోపరేటివ్ ఆడిట్ అధికారి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

- సూపర్ సిక్స్ పథకాలకు నిధులు లేక మంగళం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: ఒకర్ని ఒకసారి మోసం చేయవచ్చు..అందర్నీ ఒకసారి మోసం చేయవచ్చు.. కానీ అందరినీ అన్నిసార్లు మోసం చేయలేరనే విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ ద్వారా చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు నెరవేరుస్తారని ప్రజలందరూ వేయికళ్లతో ఎదురు చూశారని, అయితే వారి ఆశలను వమ్ము చేశారన్నారు. బడ్జెట్‌లో తల్లికి వందనం పథకం ఇస్తున్నట్టే చెప్పారని, ఇంతవరకు ఈ పథకానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని పేర్కొన్నారు. ఉచిత బస్సు పథకం ఊసే బడ్జెట్లో లేదని అన్నారు. నిరుద్యోగ భృతి కింద 20 లక్షల మందికి ఉద్యోగాలు లేదా రూ.3వేలు ఇస్తామన్నారని, దీని ఊసు కూడా బడ్జెట్‌లో లేదన్నారు. ఈ బడ్జెట్‌తో కూటమి ప్రభుత్వం ఏ విధంగా పథకాలు అమలు చేస్తుందో స్పష్టంగా అర్థమౌతుందన్నారు. పథకాలు అమలుచేసే ఉద్దేశం లేకనే ఇప్పటివరకు బడ్జెట్ ప్రవేశ పెట్టలేకపోయారని అన్నారు. ఇప్పుడు ఈ పథకాలన్నీ బడ్జెట్‌లో ఆటకెక్కించారని, ప్రజలు ఆశపడి ఓటు వేస్తే వారి ఆశలన్నీ అడియాశలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్ బాదుడు

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకసారి రూ.8వేల కోట్లు, రెండోసారి పీఆర్సీ రెగ్యులేషన్‌లో రూ.11వేలు కోట్లు వెరసి మొత్తం రూ.18 వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల మీద భారాన్ని మోపిందన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎప్పుడో ఒకసారి తప్ప పవర్ కట్ అనేది ప్రజలు ఎరుగరని, కూటమి పాలనలో కోతలు మొదలయ్యాయని అన్నారు.

పవన్ కల్యాణ్ ప్రశ్నించడే

డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించడానికి రాజకీయాలకు వచ్చానని చెప్పారని, అతడిని చూసి ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని, చంద్రబాబుతో కలిసి ఎన్నికల్లో ప్రజలకు హామీలు ఇచ్చారని, ఆ హామీలు అమలు చేయట్లేదని ఎందుకు అడగటంలేదని ప్రశ్నించారు. రాబోయే కాలంలో నైనా బడ్జెట్ కేటాయింపులు పెంచి ప్రజలకు ఇస్తానన్న హామీలు అమలు చేయాలని కోరారు.

నా చావుకు సీఐ రామకృష్ణ కారణం

- రైలు పట్టాలపై పడుకుని ఓ యువకుడు సెల్ఫీ వీడియో
- రూ.5 లక్షల లంచం కోసం బెదిరిస్తున్నారని ఆరోపణ
- సీఐ, ఓ కానిస్టేబుల్ ‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ, సీఎం చంద్రబాబులను వేడుకోలు



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ మధార్‌వలి

సాక్షి టాస్క్‌ఫోర్స్: నరసరావుపేట రూరల్ పోలీసుల వేధింపులు తాళలేక యువకుడు రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కలకలం రేపుతుంది. తన చావుకి సీఐ రామకృష్ణ, కానిస్టేబుల్ బాబు కారణమంటూ యువకుడు విడుదల చేసిన సెల్ఫీ వీడియో వైరల్‌గా మారింది. ద్విచక్రవాహనాల చోరీ కేసులో రూ.5లక్షల లంచం ఇవ్వాలన్న పోలీసుల వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు కన్నీటిపర్యంతం అయ్యాడు.

చోరీ కేసులో వేధింపులు..

పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు రోజుల కిందట ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడే ముఠా సభ్యులు ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 29 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితుల్లో మస్తాన్‌బాజీ ఇచ్చిన సమాచారం మేరకు పమిడిపాడు గ్రామానికి చెందిన మధార్‌వలి వద్ద చోరీకి గురైన వాహనాలు తాకట్టులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. దీంతో అతడితో బేరసారాలు నడిపారు. చోరీకి గురైన వాహనాలను తాకట్టు పెట్టుకోవడం నేరం అని, నిన్ను కూడా కేసులో ఇరికిస్తామని బెదిరించారు. కేసు లేకుండా చేయాలంటే రూ.5లక్షలు లంచం ఇవ్వాలని కానిస్టేబుల్ బాబు ద్వారా సీఐ రామకృష్ణ బెదిరింపులకు దిగారు. దీంతో పోలీసులు వేధింపులు తాళలేక మధార్‌వలి మూడు రోజుల కిందట ఆత్మహత్యాయత్నానికి పూనుకున్నాడు. రైలు పట్టాలపై పడుకొని తనను నరసరావుపేట రూరల్ పోలీసులు డబ్బులు కోసం బెదిరిస్తున్న తీరును వివరిస్తూ తన చావుకు కారణం సీఐ, కానిస్టేబుల్ అని సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. సీఎం చంద్రబాబునాయుడు, జిల్లా ఎస్పీ వీడియో చేరే విధంగా చూడాలని ప్రాథేయపడ్డాడు. సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయింది. మధార్‌వలి ఆత్మహత్యాయత్నం విషయం తెలుసుకున్న అతని స్నేహితులు ఫోన్‌లో నచ్చచెప్పి రక్షించినట్టు తెలిసింది.

మాటమార్చిన మధార్‌వలి..

వీడియో వైరల్ కావడంతో సోమవారం రాత్రి రూరల్ పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంటనే మధార్‌వలి ఆచూకీ కనుగొని స్టేషన్‌కు పిలిపించారు. ఆ తరువాత ఏమి జరిగిందో ఏమో కాని మధార్‌వలి మరో వీడియో విడుదల చేశాడు. పోలీసుల భయంతో తాను మొదట రైలు పట్టాలపై సెల్ఫీ వీడియో రిలీజ్ చేశానని అందులో చెప్పుకొచ్చాడు. తనని పోలీసులు బెదిరించలేదని, చోరీ కేసులో అరెస్ట్ చేస్తారనే భయంతో వీడియో చేశానని తెలిపాడు.

వేధింపులకు గురిచేయలేదు

ద్విచక్రవాహనాల చోరీ కేసులో మధార్‌వలి రిసీవర్‌గా ఉన్నాడు. చోరీకి గురైన వాహనాలు ఇతని వద్ద ఉన్నాయి. విచారణ కోసం స్టేషన్‌కు రమ్మని పిలిచాం. కేసు నమోదు చేస్తామని భయపడి వీడియో విడుదల చేశాడు. మధార్‌వలిని లంచం అడిగిన మాట అబద్ధం.

–పి.రామకృష్ణ, రూరల్ సీఐ

పల్నాటి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలకు వచ్చే వీరాచారులకు తగిన సౌకర్యాల కల్పనపై ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఆర్ వెంకటేశ్వర్లు నాయక్ మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే వీరాచారుల సౌకర్యార్థం ముఖ్యంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ, తహసీల్దార్ నిర్ణయించారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల ఉద్యోగులు విరాళాల ద్వారా టాయ్‌లెట్స్ నిర్మించడానికి నిర్ణయించుకున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. దాత బత్తుల కోటేశ్వరరావు గతంలో టాయిలెట్స్ నిర్మాణానికి పూనుకుని అసంపూర్తిగా వదిలేసిన వాటిని పూర్తి చేస్తామని, తాము కూడా కొన్ని ఏర్పాటు చేయిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారని తెలిపారు. చాలా కాలంగా వీరాచారులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఉత్సవాల ప్రధాన ప్రాంగణమైన వీరుల గుడి ఆవరణలో తగినన్ని ఎల్‌ఈడీ లైట్లు వేయించాలని, బస్టాండ్ సెంటర్ చెన్నకేశవస్వామి, అంకాలమ్మ తల్లి ఆలయాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఎంపీడీఓ, తహసీల్దార్‌లు ఆదేశించారు. నాగులేరును పరిశుభ్రం చేసే చర్యలను తీసుకోవాలని ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కసిన్యానాయక్‌ను ఎంపీడీఓ ఆదేశించారు. నాగులేరు గంగధారి మడుగును పరిశుభ్రం చేయాలని వీరాచారులు ఆచార వ్యవహారాలు నిర్వహించుకునేందుకు వీలుగా అక్కడ పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. మంచినీరు అందించే ఏర్పాట్లు, ఏర్పాట్లు వీరుల గుడి వద్ద వీరాచారులు జట్లు స్నానాలు చేయడానికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా నాగులేరు పరిసరాలలలో పరిశుభ్రంగా ఉంచేందుకు వాచ్‌మెన్‌ను నియమించాలని పంచాయతీకి సూచించారు. ప్రజలు కూడా ఎవరూ వ్యర్థాలు నాగులేరులో వేయవద్దని వేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను పలువురు గ్రామ పెద్దలు సూచించారు. సమావేశంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అవకాశాలు మెండు

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల
- ఉత్సాహంగా ప్రారంభమైన వర్సిటీ మహిళా కబడ్డీ పోటీలు
- లీగ్ దశకు చేరుకున్న జట్లు



పోటీలను ప్రారంభిస్తున్న గోనుగుంట్ల

నరసరావుపేట ఈస్ట్: క్రీడాకారులకు విద్య, ఉద్యోగ రంగాలలో ప్రభుత్వాలు ప్రాధాన్యమిచ్చి ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నట్టు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు మంగళవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన గోనుగుంట్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు క్రీడా పాలసీని తీసుకువచ్చి క్రీడాకారులకు అవకాశాలు పెంచినట్టు తెలిపారు. విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ శాతాన్ని పెంచటంతోపాటు క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. వర్సిటీ క్రీడా విభాగాధిపతి ప్రొఫెసర్ పాల్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులకు వర్సిటీ ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నదని తెలిపారు. ఒక్క ఏఎన్‌యూ మాత్రమే జాతీయస్థాయి క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులకు 10 శాతం మార్కులను కలపటంతోపాటు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నదన్నారు. జాతీయ, సౌత్ జోన్, సెంట్రల్ జోన్ స్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులకు మార్కులతోపాటు నెలవారీ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకటరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈదర ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

లీగ్‌కు చేరిన జట్లు...

వర్సిటీ అంతర్ కళాశాలల మహిళా కబడ్డీ పోటీలను నాకౌట్ కమ్ లీగ్ విధానంలో నిర్వహిస్తున్నారు. వర్సిటీ పరిధిలోని కళాశాలల నుంచి 11 జట్లు పోటీలకు హాజరయ్యాయి. పోటీల్లో భాగంగా వర్సిటీ వ్యాయామ కళాశాల, కృష్ణవేణి డిగ్రీ కళాశాల, విక్టరీ డిగ్రీ కళాశాల (నరసరావుపేట) జెఎంజె మహిళా కళాశాల (తెనాలి) జట్లు లీగ్ దశకు చేరుకున్నాయి. నాకౌట్ దశలో బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై బాపట్ల మహిళా కళాశాల జట్టు 10 పాయింట్లు, వాగ్దేవి కళాశాల జట్టుపై ఎంఏఎం ఫార్మసీ కళాశాల జట్టు 4 పాయింట్లు, ధనలక్ష్మి వ్యాయామ కళాశాల జట్టుపై విక్టరీ కళాశాల జట్టు, గుంటూరు ఉమెన్స్ కళాశాల జట్టుపై ఏఎన్‌యూ జట్టు, ఎంఏఎం కళాశాల జట్టుపై కృష్ణవేణి కళాశాల జట్టు విజయం సాధించాయి.

కోదండరామునికి లక్ష తులసి దళార్చన



అమరావతి: అమరావతిలోని సీతాసమేత కోదండరామస్వామి వారికి కార్తిక శుద్ధ ఏకాదశి సందర్భంగా లక్ష తులసి పూజను మంగళవారంనిర్వహించారు. వేదపండితుడు సుబ్బరామశాస్త్రి వారసులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, నవగ్రహారాధన అనంతరం లక్ష నామాలతో తులసి దళార్చన నిర్వహించారు.

20న శృంగేరీ ఉత్తరాధికారి రాక

నరసరావుపేటఈస్ట్:శృంగేరి దక్షిణామ్నాయ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ మహాస్వామి నరసరావుపేట రానున్నారు. గతనెల 17వ తేదీ నుంచి ప్రారంభించిన విజయయాత్రలో భాగంగా ఆయన ఈనెల 20, 21తేదీలలో పట్టణంలోని శృంగేరీ శంకరమఠంలో విడిది చేస్తారు. రెండు రోజుల పాటు అభిషేకాలు, పూజలకు ఏర్పాట్లు చేశారు.